సాక్షి నారాయణపేట

మంగళవారం । 2 । జూలై । 2024



శిథిలంతో ప్రమాదం..
వానాకాలంలో శిథిలావస్థకు చేరిన మట్టి ఇళ్లు, భవనాలు ప్రమాదకరంగా మారాయి.
వివరాలు 8లో ▸



ఫార్మా చిచ్చు..
దేశాయిపల్లి ఫార్మా కంపెనీతో వ్యవసాయ బోరుబావులు కలుషితమవుతున్నాయి.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /23.2

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మాగనూర్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మాగనూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో స్పీడ్ సైక్లింగ్ పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ బి. గోపాలం మాట్లాడుతూ.. ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల బాలురకు మాగనూర్ మండల కేంద్రం నుంచి కొత్తపల్లి గ్రామం వరకు స్పీడ్ సైక్లింగ్ పోటీలను 12 నుంచి 15 సంవత్సరాల మధ్య గల బాలురకు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీలలో దర్శన్, ఆకాష్, రాకేష్, అక్బర్, గణేష్, సందీప్‌గౌడ్ ప్రతిభ కనబర్చారని తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, అశోక్‌గౌడ్, పెద్దింటి రాజు, వాకిటి శ్రీనివాసులు, వేణుగోపాల్, కృష్ణయ్య, పిఈటిలు రాకేష్, అమ్రేష్ పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ
మక్తల్: పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం అందించే వసతులు, సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం హాస్టల్ వెనక బాగాన డ్రెయినేజీ నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు తెలపగా.. ఆయన డ్రెయినేజీని పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారంలోగా డ్రెయినేజీ, సీసీ రోడ్డు మరమ్మతు చేయిస్తానని ఆయన పేర్కొన్నారు.

ఇంటర్ నోడల్ అధికారిగా సుదర్శన్‌రావు

నారాయణపేట రూరల్: ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి జిల్లా నోడల్ అధికారిగా హెచ్.సుదర్శన్‌రావు సోమవారం స్థానిక డీఐఈఓ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. నోడల్ అధికారి రియాజ్ హుస్సేన్ తాజాగా పదవీ విరమణ పొందారు. దీంతో జిల్లాలో సీనియారిటీ ప్రకారం మాగనూర్ కళాశాల ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్న హెచ్.సుదర్శన్‌రావుకు నూతన నోడల్ అధికారిగా అవకాశం వచ్చింది. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

నీరుగారిన లక్ష్యం



తీలేర్‌లో పర్యవేక్షణ లేక గడ్డిలో కలిసిన ఈత వనాలు

- కల్తీకల్లు నివారించేందుకు ఈత వనాలపై దృష్టి
- మూడేళ్లలో 1.15లక్షల ఈత మొక్కలు నాటిన వైనం
- క్షేత్రస్థాయిలో కరువైన పర్యవేక్షణ.. నిర్వహణ
- ప్రస్తుతం జాడలేని ఈత వనాలు

మరికల్: కల్తీకల్లును పూర్తిగా నివారించేందుకు గత ప్రభుత్వం హరితహారం పథకం కింద ఈత వనాలను నాటించింది. కానీ, అవి ఇప్పుడు ఎక్కడా కనబడటం లేదు. ఉన్న వాటి పరిరక్షణ లేక మొక్కల ఎదుగుదల తగ్గి గిడుగు బారిపాతున్నాయి. ప్రభుత్వం హరితహారం పథకంలో వివిధ రకాల మొక్కలను ప్రత్యేకంగా తెప్పించి నాటిస్తున్నా నిర్వహణ లోపం వల్ల లక్ష్యం నీరుగారిపోతోంది. జిల్లాలో ఈత వనాలు విస్తీర్ణం తక్కువ. ఈ నేపథ్యంలో యేటా హరితహారం పథకంలో ఈత మొక్కలు నాటించే కార్యక్రమం కొనసాగుతోంది. గత మూడేళ్ల వ్యవధిలో 1,15,900 మొక్కలు నాట్లారు. అందులో 10 శాతం కూడా కనిపించడం లేదు. వాగులు, వంకల పక్కనున్న ఈతచెట్లను రైతులు క్రమేపీ తొలగించి సాగు భూములుగా మార్చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నాటిన మొక్కలను సైతం తొలగించేస్తున్నారు. ఉన్నా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత వారవెరన్నది కూడా తెలియని పరిస్థితి ఉంది.

సంరక్షిస్తాం..
జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈత వనాలను పరిశీలించి మొక్కలను సంరక్షించేందుకు డీఆర్డీఏ, పంచాయతీ శాఖల అధికారులతో మాట్లాడతాం. మరిన్ని ఈత వనాలను పెంచేలా చర్యలు తీసుకుంటాం. ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశిస్తే మరిన్ని మొక్కలు నాటేందుకు భూములను గుర్తిస్తాం. – అశోక్‌కుమార్, ఆబ్కారీ సీఐ, నారాయణపేట

కల్తీకల్లే దిక్కు..
ఈత వనాలు విరివిగా పెంచి కుల్లుకు బదులుగా నీరా దుకాణాలు తెరిపిస్తామని అప్పట్లో అబ్కారీ శాఖ మంత్రి ప్రకటన చేశారు. జిల్లాలో మొత్తం వెతికినా నీరా దుకాణాలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. ఎక్కడ చూసినా కల్తీ కల్లు దుకాణాలే అగుపిస్తున్నాయి. సీహెచ్, డైజోపాం, అల్ప్రాజోమ్ లాంటి మత్తు పదార్థాలు కలిపి కల్లు తయారీ చేసి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో కల్తీ కల్లు తాగి ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. బయటకు రావడంలేదుకానీ నిత్యం జిల్లా వ్యాప్తంగా ఎక్కడో ఒక గ్రామంలో ఏదో ఒక చోట కల్తీకల్లు మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. వీటిని అరికట్టాలంటే ఈత వనాలు పెంచడటంతో సాధ్యమని ప్రభుత్వం భావిస్తున్నా లక్ష్యానికి క్షేత్రస్థాయిలో మాత్రం తూట్లు పడుతున్నాయి.

ఎవరిదీ లోపం..
ఈత మొక్కలు నాటే కార్యక్రమంతా ఆబ్కారీ శాఖ పర్యవేక్షణలో ఉంటుంది. వారు నాటిన మొక్కలను బతికించే బాధ్యత డీఆర్డీఏ పరిధిలో గ్రామ పంచాయతీలు చూసుకోవాల్సింటుంది. అయితే శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రెండు శాఖల పరిస్థితి కూడా అలాగే ఉంది. తమ శాఖ పరిధిలో విధించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటడం మాత్రమే మావంతు బతికించుకునేది పంచాయతీల వంతు అన్న విధంగా శాఖల యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు కన్పిస్తోంది. జిల్లాలో ప్రతి మండలంలో ఈత వనాలను నాటారు. కానీ మొక్కలు మాత్రం కనిపించటం లేదు. ఉన్న వాటికి అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో గడ్డిలో కలిసిపోయాయి. వీటిని నాటడం, నిర్వహణ కోసం ఏటా రూ.లక్షలు ఖర్చవుతున్నాయి. ఆశించిన ఫలితం మాత్రం కనిపించటం లేదు.



ధన్వాడ శివారులో ఈత వనాలను తొలగించడంతో ఏర్పడిన ఖాళీ స్థలం

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశానికి 30మంది ఎంపిక

నారాయణపేట: రాష్ట్రంలోని ఆయా క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంపిక పరీక్షలో జిల్లా నుంచి 30 మంది ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వెంకటేష్ వెల్లడించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపికైన వారు ఈనెల 11, 12 తేది రెండు రోజులు హకీంపేట క్రీడా పాఠశాలలో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనాలని సూచించారు. 11న ఉదయం అక్కడికి వెళ్లి రిపోర్ట్ చేయాలన్నారు. 18 మంది బాలురు ,12 మంది బాలికలు జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులు వారికి సంబంధించిన బోనోఫైడ్, ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికెట్, 3వ తరగతి ప్రగతి పత్రం, 5 ఫొటోలు తీసుకుని ఉదయం 7 గంటల వరకు హాకీం పేట క్రీడా పాఠశాల వద్ద హాజరు కావాలని కోరారు.

కొత్త చట్టాల కింద జిల్లాలో తొలి కేసు



నారాయణపేట: రోడ్డు ప్రమాదానికి సంబంధించి నూతన చట్టాల కింద సోమవారం జిల్లాలో తొలి కేసు నమోదైందని ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఊట్కూరు మండలం బిజ్వర్ గ్రామానికి చెందిన గవినోల నరసింహారెడ్డి, అతని భార్య జయమ్మ సొంత పని మీద నారాయణపేట పట్టణానికి వచ్చారని, పని ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో అంబేద్కర్ చౌరస్తా సమీపంలో వెళ్తుండగా వెనక నుంచి ఓ వ్యక్తి బైకుపై అతివేగంగా, అతిజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టాడన్నారు. దీంతో జయమ్మకు గాయాలు కావడంతోపాటు వాహనం సైతం ధ్వంసమైందని, ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదు పై 2024 యు/ఎస్ 125 (ఎ) (బీఎన్ఎస్) భారతీయ న్యాయ సంహిత చట్ట ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న మౌలిక వసతుల పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలిసి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులన్నీ ఈ నెల 8వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని పాఠశాలల్లో చేసిన నిర్మాణ పనులకు సంబంధించి ఫోటోగ్రఫీతో కూడిన డాక్యుమెంటరీని తయారుచేయాలని అధికారులకు సూచించారు. కేవలం మన జిల్లాలోనే నిర్మాణ పనుల బిల్లులను 50 శాతం చెల్లించడం జరిగిందన్నారు. బిల్లుల చెల్లింపులపై జీఎస్టీ విషయంలో తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ మాట్లాడుతూ జిల్లాలోని 328 పాఠశాలలో చేపట్టిన నిర్మాణ పనులకు గాను ఇంత వరకు 135 పాఠశాలల్లో పనులన్నీ పూర్తయ్యాయని, 193 పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయని, రూఫ్, శానిటేషన్ పనుల వల్ల పది రోజులు ఆలస్యం అవుతుందని కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీరాజ్ ఈఈ హిర్యా నాయక్, సీపీఓ జీవరత్నం పాల్గొన్నారు.

మన చరిత్ర తెలుసుకోవాలి
నారాయణపేట జిల్లా తెలంగాణలో చరిత్ర, సంస్కృతి పరంగా విలక్షణమైందని, దీన్ని విద్యార్థుల నుంచి పెద్దల వరకు అందరూ తప్పక అధ్యయనం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సీఎస్ఆర్ స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య మాట్లాడుతూ ఇప్పటికే 19 జిల్లాల సమగ్ర సంపుటాలు ఆవిష్కృతమయ్యాయని వివరించారు. సాహితీవేత్త డాక్టర్ ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి పాలమూరు జిల్లా సంస్థానాల సాహిత్య పోషణపై సోదాహరణంగా వివరించారు. ఈ గ్రంథానికి వ్యాసాలు సమకూర్చడంలో విశేషంగా కృషిచేసి ఇటీవల దివంగతుడైన తాటి నర్సప్పకు సభ శ్రద్ధాంజలి ఘటించింది. నారాయణపేట జిల్లా సమగ్ర స్వరూప గ్రంథం కోర్ కమిటీ సభ్యులు తాటి కృష్ణ సభను నిర్వహించగా కోర్ కమిటీ సభ్యులు రామ్మోహన్‌రావు, గొల్ల కురుమన్న యాదవ్‌తోపాటు వ్యాసాలు అందించిన 40 మంది రచయితలను చెన్నయ్య జ్ఞాపిక, పుస్తక ప్రతితో సత్కరించారు. ప్రిన్సిపల్ నారాయణ గౌడ్, రచయితలు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

నారాయణపేట: ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించటంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి స్వయంగా కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 55 ఫిర్యాదులు రాగా..వాటిని పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్‌డిఓ. మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 8 అర్జీలు
జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుంచి స్వయంగా స్వీకరించి వాటిని పరిష్కరించాలని సీఐలు, ఎస్ఐలకు సూచించారు. 8 ఫిర్యాదుల్లో ఒక ఫిర్యాదు ఫ్యామిలీ గొడవలకు సంబంధించినది, మిగితా ఏడు ఫిర్యాదులు భూములకు సంబంధించి వచ్చాయి. భూతగాదాలకు సంబంధించి కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు.

• తెల్లారిన బతుకులు

నిద్రలోనే మృత్యుఒడిలోకి..

పాత ఇంటి మిద్దె కూలి నలుగురు సమాధి



జనరల్ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

- ముగ్గురు పిల్లలతో సహా భార్య మృతి.. భర్తకు తీవ్రగాయాలు
- నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో విషాదం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

సాక్షి, నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ క్రైం: గాఢనిద్రలో ఉండగానే అనంత లోకాలకు వెళ్లిపోయారు. ఎప్పటిలాగే నిత్యం ఉంటున్న ఇంటిలోనే ఆదమరచి నిద్రపోయారు. ఎండ, వాన, గాలి నుంచి రక్షణగా ఉందనుకున్న ఆ ఇంటి పైకప్పే మృత్యువు రూపంలో కుటుంబంలోని నలుగురిని కబలించింది. వర్షానికి తడిసిన పాతబడిన ఇంటి మట్టి మిద్దె కూలి తల్లితో పాటు ఇద్దరు కూతుళ్లు, పది నెలల కుమారుడు మరణించిన ఘటన కలకలం సృష్టించింది. ఒకే కుటుంబంలోని నలుగురు మరణించడంతో ఊరంతా శోక సంద్రంలో మునిగిపోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం మీపంలోని వనపట్లలో సోమవారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది.

ఏ దిక్కు లేక పాతబడిన ఇంట్లోనే ఉంటూ..
వనపట్లకు చెందిన గొడుగు భాస్కర్ జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం మరికల్‌కు చెందిన పద్మ(26)ను తొమ్మిదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు తేజస్విని(7), వసంత(5)తో పది నెలల కుమారుడు రిత్విక్ ఉన్నాడు. భాస్కర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా, భార్య పద్మ ఇంట్లోనే ఉండి పిల్లల బాగోగులు చూసుకుంటోంది. భాస్కర్ తల్లిదండ్రులు చిట్టెమ్మ, బాలస్వామి, భార్య, పిల్లలతో కలసి 30 ఏళ్ల కిందటి శిథిలావస్థలో ఉన్న పాత ఇంటిలోనే నివాసం ఉంటున్నారు. ఏళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు కాలేదు. ఏ దిక్కు లేక పాతబడిన ఇంట్లోనే ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి ముసురువాన ఉండటంతో కుటుంబసభ్యులందరూ పాత ఇంటిని ఆనుకునే ఉన్న రేకుల షెడ్డులో పడుకున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో అర్ధరాత్రి వేళ భాస్కర్, తన భార్య, పిల్లలు పాత ఇంటిలోకి వచ్చి నిద్రపోయారు. వర్షానికి బాగా తడిసిన మట్టి మిద్దె ఒంటిగంట సమయంలో పెద్ద శబ్దంతో నిద్రిస్తున్న వారిపై కూలింది. దీంతో రేకులషెడ్డులో నిద్రపోతున్న భాస్కర్ తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు మేల్కొని.. వెంటనే అప్రమత్తమై శిథిలావస్థలో ఉన్నవారిని బయటికి తీసేందుకు ప్రయత్నించారు. రాళ్లు, కర్రలు, మట్టి శిథిలాల్లో కూరుకుపోయి భాస్కర్ భార్య పద్మ, కూతుళ్లు తేజస్విని, వసంత, కుమారుడు రిత్విక్ అక్కడిక్కడే మరణించారు. భాస్కర్‌పై బీరువా పడగా గాయాలతో బయటపడ్డాడు. గాయాలతో ఉన్న భాస్కర్‌ను జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

శిథిలమైన ఇళ్లలో బిక్కుబిక్కు..
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పట్టణాలు, గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 8 వేలకు పైగా పాతబడిన ఇళ్లు ఉన్నాయని అధికారులు గుర్తించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వీటి సంఖ్య 1,350గా ఉంది. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని వీరిని సురక్షిత ప్రాంతాలకు, పంచాయతీ, ప్రభుత్వ భవనాలకు తరలించాల్సి ఉన్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో ఉంటున్నవారిని సురక్షిత ప్రాంతాల్లో ఉండేందుకు అవకాశం కల్పించాలని బాధితులు కోరుతున్నారు.



మట్టిమిద్దెఇంటికి ఆనుకుని ఉన్న రేకుల షెడ్డు

కూలుతుందని తెలిసినా.. భయంగా గడుపుతున్నాం..



ఏళ్లుగా పాతబడిన ఇంట్లోనే ఉంటున్నాం. ఆర్థిక ఇబ్బందులతో కొత్త ఇల్లు కట్టుకునేందుకు అవకాశం లేదు. ఇప్పటికే పలుమార్లు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం ఇవ్వలేదు. ఇంటిపై పాలిథిన్ కవర్లు కప్పుకుని ఉంటున్నాం. చిన్నపాటి వర్షం వచ్చినా ఎప్పుడు కూలుతుందోనని భయంతో గడుపుతున్నాం.
– నాగమ్మ, వనపట్ల, నాగర్‌కర్నూల్ మండలం

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు..
ఏటా వానాకాలం సీజన్‌కు ముందే గ్రామాల్లో పాతబడిన, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తున్నాం. బంధువుల ఇళ్లలో, పంచాయతీ భవనాల్లోనైనా ఉండాలని చెబుతున్నాం. పాతబడిన ఇళ్లలో ఉండేవారిని సురక్షిత ప్రదేశాల్లో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. అధికారులు ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.
– కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి, నాగర్‌కర్నూల్



మట్టిమిద్దె కూలడంతో మృతిచెందిన తల్లి, ముగ్గురు చిన్నారులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి జూపల్లి



చికిత్స పొందుతున్న భాస్కర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఘటనకు దారితీసిన కారణాలు, భాస్కర్ ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనరల్ ఆస్పత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్న భాస్కర్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.4 లక్షల పరిహారం అందిస్తున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ఘటనస్థలికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని అధికారులను ఆదేశించారు. వానాకాలం నేపథ్యంలో పాత ఇళ్లలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు.

'సంపూర్ణత అభియాన్' కార్యాచరణ రూపొందించాలి

నారాయణపేట: జిల్లాలో ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి రంగాల్లో వంద శాతం సంతృప్తతను సాధించడానికి సంపూర్ణత అభియాన్ కార్యాచరణ రూపొందించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024 జూలై నుంచి సెప్టెంబరు 2024 వరకు కేంద్రీకృత ప్రయత్నం విస్తరించి ఉందని, సంఘం శ్రేయస్సు కోసం ఈ క్లిష్టమైన ప్రాంతాలను సమగ్రంగా కవరేజీ చేయడం, మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మూడు నెలల ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ ప్రణాళిక తయారుచేయాలన్నారు. ఈమేరకు ఎన్‌సిడిలో షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ ఎలా చేస్తారని ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారి సౌభాగ్యలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. నర్వ మండలంలోని వారందరికీ ఈ మూడు నెలల్లో వంద శాతం స్క్రీనింగ్ చేయాలన్నారు. నర్వ మండలంలోని 542 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ లలో రివాల్వింగ్ ఫండ్ ఎంత ఉందని, ఆ ఫండ్‌తో మహిళా గ్రూపులు సాధించిన ప్రగతి గురించి డీఆర్డిఓ రాజేశ్వరినిఅడిగి తెలుసుకున్నారు. మూడు నెలల్లో ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి రంగాల్లోని ఆరు కీలకమైన ఆకాంక్షాత్మక బ్లాక్ ప్రోగ్రామింగ్ సూచికల వంద శాతం సంతృప్తతను సాధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సాంకేతికతతో కేసుల పరిష్కారానికి కృషి



మాగనూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: సాంకేతికతతో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని.. పెండింగ్ కేసులు త్వరగా చేదించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. సోమవారం జిల్లాలోని సిఐలు, ఎస్ఐలకు పెండింగ్ కేసులపై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈమేరకు గ్రేవ్, నాను గ్రేవ్ కేసులను సిఐలను, ఎస్ఐలను అడిగి తెలుసుకొని, ఇవి ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలి, ఏ ఏ అంశాలు క్రోడీకరించాలి తదితర అంశాలను వివరించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలని, కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. గంజాయి, గుట్కా, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. దొంగతనాల కేసుల్లో ప్రతిరోజు కేసుల చేదన గురించి అన్ని కోణాల్లో సిసిటిఎన్ఎస్‌లో డాటా ఎంట్రీ ప్రతిరోజూ మానిటర్ చేయాలని సూచించారు. రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర వర్టికల్, విధులు పై సమీక్షించారు. దొంగతనాల నిర్మూలన కొరకు రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. విపిఓలు గ్రామాలలో పర్యటించి సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిఐలు శివ శంకర్, రామ్ లాల్, చంద్ర శేఖర్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ, బాధ్యత అవసరం
మాగనూర్: పోలీసులు క్రమశిక్షణ, బాధ్యతతో మెలగాల్సిన అవసరం ఉందని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. సోమవారం మాగనూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్టేషన్ కర్ణాటక బార్డర్‌లో ఉన్నందున దొంగతనాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో నిరంతరం నిఘా ఉంచాలని, నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

రాజోళి: కుటుంబ కలహాలు, అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీనువాసులు(60) రాజోళి చేనేత సహకార సంఘంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ, ఇటీవల పదవీ విరమణ పొందారు. సోమవారం తన కుమారుడు చేనేత కార్యాలయం దగ్గర బైక్‌పై వదిలివెళ్లాడు. మధ్యాహ్న సమయంలో రాజోళిలోని సుంకేసుల డ్యాంపై నుంచి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారు డు బస్వరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యాభర్తలు గొడవపడి భర్త..

గోపాల్‌పేట: భార్యాభర్తలు గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చాకల్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన నిరంజన్ (62) భార్య ఎల్లమ్మ వ్యవసాయం చేసుకుని బతికేవారు. వీరికి ముగ్గురు కుమారులు ఉండగా, అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ఎవరి ఇంటి దగ్గర వారు విడివిడిగా ఉంటున్నారు. సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో భార్యాభర్తలు డబ్బుల విషయంలో ఇద్దరూ గొడవ పడ్డారు. క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో స్థానికులు తలుపు తీసి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు.

లోయలో పడిన టిప్పర్: ఇద్దరికి తీవ్ర గాయాలు



దోమలపెంట: కంకరలోడ్‌తో వస్తున్న టిప్పర్ సోమవారం దోమలపెంటలో బ్రేక్ ఫెయిల్ కావడంతో లోయలో పడింది. కానిస్టేబుల్ సుక్య తెలిపిన వివరాలు ప్రకారం దోమలపెంటలోని మిషన్ భగీరథ పనుల కోసం టిప్పర్ కంకర్ లోడ్‌తో వస్తుందన్నారు. అటవీ చెక్‌పోస్టు దాటిన తర్వాత బ్రేక్ పడక పోవడంతో చెక్‌పోస్టు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ప్రయాణించి గోవిందరాజులునగర్ వద్ద మొదటి రోడ్డు మలుపు వద్ద నున్న ఇనుప రాడ్లను వేగంగా ఢీకుని లోయలో పడిందని చెప్పారు. టిప్పర్ డ్రైవర్ ఖదీర్‌ను స్థానికులు బయటకు తీసుకుని వచ్చి సున్నిపెంటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరోవ్యక్తి హరీష్ ముళ్ల పొదల్లో చిక్కుకుపోవడంతో కొంత సమయం తర్వాత గుర్తించి బయటకు తీసుకొచ్చారు. జెన్‌కో ఆస్పత్రిలో ప్రథమచికిత్స అందించి గాయపడిన ఇద్దరిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. టిప్పర్ యజమాని మన్ననూర్‌కు చెందిన రెహ్మాన్‌గా తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన సంకీర్తనా వారోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: అన్నమయ్యవాణి లలితా సంగీత విద్యాలయం వ్యవస్థాపకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న వనమాలి పాదపద కవితా తాతా సంకీర్తనా చతుర్థ వారోత్సవాలు సోమవారం రాత్రి వైభవంగా ముగిశాయి. కార్యక్రమంలో నర్సింహస్వామి ఉపాసకులు సద్గురు రామ్మోహనస్వామి పాల్గొని ఆశీర్వాచనం చేశారు. ఈ సందర్భంగా గద్వాల చంద్రశేఖర రావు పలు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతిలో ఇప్పటివరకు 151 సార్లు సంకీర్తనా కచేరి నిర్వహించానని, ఈ అదృష్టాన్ని ఆ తిరుమల వేంకటేశ్వరస్వామియే కల్పించారని తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలు మీ ముంగిట అనే కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు వెయ్యికిపైగా గృహాల్లో గోవిందనామాలు పాడినట్లు తెలిపారు. అనంతరం సంగీత విద్యాలయంలో శిక్షణ తీసుకున్న వారు కూడా సామూహికంగా పలు సంకీర్తనలు ఆలపించారు. అతిథులకు చంద్రశేఖరరావు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సామవేదం వేంకటమురళీకృష్ణ, ప్రముఖ విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, సుందర సత్సంగ్ ప్రతినిధి చంద్రశేఖర్ యాదవ్, లక్ష్మమ్మ, రంగనాథాచార్యులు, భీమాచారి, రాఘవేంద్రశర్మ, శ్రీకాంత్‌శర్మ, జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మక్తల్ మండలం మాద్వార్‌లో కూలిపోయిన ఇంటి వద్ద గుడిసెబుచ్చప్ప



తెలకపల్లి మండలం గౌరారంలో శిథిలావస్థలో ఇల్లు



గట్టులోని చాకలి వీధిలో ప్రమాదకరంగా ఉన్న మట్టిమిద్దె

శిథిలంతో ప్రమాదం

వర్షాలతో పొంచి ఉన్న ముప్పు

- గ్రామాలు, పట్టణాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లు, భవనాలు
- ఖాళీ చేయించడంలో యంత్రాంగం నిర్లక్ష్యం
- ప్రమాదం జరిగితే ఆస్తి, ప్రాణ నష్టం.. ముందే మేలుకొంటే మేలు..

సాక్షి ఫోకస్

సాక్షి, నెట్‌వర్క్: వర్షాకాలం వచ్చిందంటే చాలా గ్రామాల్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. ఏళ్ల కిందట నిర్మించుకున్న పాత మట్టి మిద్దెల్లోనే వేలాది కుటుంబాలు కాలం వెల్లదీస్తున్నారు. కొత్త భవనాలు నిర్మించుకోలేక పాతబడిన మిద్దెల్లోనే చిన్నపాటి మరమ్మతు చేసుకుని నివాసం ఉంటున్నారు. గతంలో మట్టి మిద్దెలు కూలిన ఇళ్లల్లోనే అలాగే ఉంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మిద్దెలు ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన తప్పడం లేదు. ఈదురు గాలులు వీస్తే రేకులు ఎగిపోవడంతో పాటు, వర్షం కురిస్తే ఆ మిద్దెలు కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది. అయితే పాత ఇళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అధికార యంత్రాంగం ముందే మేల్కొనకపోతే.. ముమ్ముందు భారీ వర్షాలకు మట్టిమిద్దెలు, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలు పరిస్థితి ఏంటనేది సందేహం చాలా మందిలో నెలకొంది. దీనిపై 'సాక్షి' ఫోకస్‌కథనం..



రాజోళి మండలం పచ్చర్లలో శిథిలావస్థకు చేరిన మట్టిమిద్దెకు రేకులతో కప్పిన ఇల్లు



నవాబుపేట మండలం అమ్మపూర్‌లో శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంక్



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయంలో దెబ్బతిన్న గదిపైకప్పు

■ పాన్‌గల్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ(ఎంఈఓ) కార్యాలయం శిథిలావస్థకు చేరి వర్షం వస్తే పైకప్పు నీరు కారుతుంది. తహసీల్దార్ కార్యాలయంలో ఒక గది పై కప్పు రేకులు కొంత భాగం పడిపోయాయి. తెల్లరాళ్లపల్లి తండాలో బికీని అనే మహిళ ఇళ్లు పైకప్పు దెబ్బతింది. బుసిరెడ్డిపల్లిలో తెలుగు అంజనమ్మకు చెందిన ఇళ్లు కప్పు వర్షం వస్తే నీరు కారుతుందని, తప్పని పరిస్థితులల్లో ఇందులో ఉంటున్నామని ఆమె తెలిపారు.

■ మద్దూరు మండల కేంద్రంలోని బాలిక ఉన్నత పాఠశాలలో ఉన్న పది, తొమ్మిదో తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయి. గదుల కొరతతో తప్పని పరిస్థితుల్లో ఇందులోనే విద్యార్థులకు కూర్చోవాల్సి వస్తుంది. మన ఊరు-మన బడి కింద పాఠశాల తరగతి గదులు నిర్మాణం మధ్యలో ఆగిపోయింది.

■ మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్‌లో కమ్మరి బుచ్చమ్మ ఇల్లు కొంతకాలంగా వర్షాలకు కురుస్తూ ఓవైపు కూలుతూ ప్రమాదకరంగా ఉంది. మరో ప్రత్యామ్నాయ ఇల్లు లేకపోవడంతో అందులో నివాసం ఉంటుంది.

■ అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పైకప్పు నుంచి వర్షం నీళ్లు కిందికి లీకవుతున్నాయి. గర్భిణులు, బాలింతలు నిలిచిన నీళ్లతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

■ నవాబుపేట మండలంలోని అమ్మపూర్ ఎస్సీ కాలనీలో వాటర్‌ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దాని పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు నిత్యం భయంతో కాలం వెల్లదీస్తున్నారు.

■ మక్తల్ మండలం మాద్వార్‌లో గుడిసె బుచ్చప్ప ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఇంటి నిర్మాణం చేసేకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో అదే పడిపోయిన ఇంట్లోనే కవర్ కప్పి జీవనం కొనసాగిస్తున్నారు.

■ తెలకపల్లితోపాటు అన్ని గ్రామాలలో దాదాపు 10 ఇళ్ల వరకు పాత మట్టి మిద్దెలు ఉన్నాయి. మండల తహసీల్దార్ కార్యాలయంలో గది శిథిలావస్థలో ఉంది.

■ గట్టు మండలంలో నెల రోజుల క్రితం ఆరగిద్దలో వర్షానికి తిమ్మప్ప ఇంటి మట్టిమిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణాపాయం తప్పింది.

■ నాగర్‌కర్నూల్ మండలం వనపట్లలో సోమవారం తెల్లవారుజామున ఇంటి పైకప్పు కూలి నిద్రిస్తున్న నలుగురు ప్రాణాలు కోల్పోయారు. రెండేళ్ల క్రితం కుమ్మెర గ్రామంలో ఇల్లు కూలడంతో అందులో ఉన్న తాతా, మనవడు మృతి చెందారు. మండలంలోని 19 పంచాయతీల్లో 500 పైగా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధానంగా తూడుకుర్తి పంచాయతీ, అనుబంధ గ్రామాలు భాగ్యనగర్, రాంరెడ్డిపల్లితండాలో దాదాపు 200 వరకు శిథిలమైన ఇళ్లు ఉన్నాయి. కుమ్మెరలో 80, మంతటిలో 30, శ్రీపుర్‌లో 70, గగ్గలపల్లిలో 25, గుడిపల్లిలో 60, పెద్దముద్దునూర్‌లో 80 వరకు శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఉన్నాయి.



మానవపాడు మండలం చెన్నిపాడులో నెర్రెలిచ్చిన పాత ఇల్లు

■ మానవపాడు మండలంలోని చెన్నిపాడు చెందిన తిమ్ములమ్మ పాత ఇల్లు శిథిలావస్థకు చేరింది. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మమ్మ ఇంటి నిర్మాణం పైకప్పు నెర్రెలిచ్చింది. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయని పేద కుటుంబాలను ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకోంటున్నారు.



ప్రమాదభరితంగా వడ్డేపల్లి మండలం జూలెకల్ పశువైద్యశాల సబ్‌సెంటర్

■ పశువైద్యశాల పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నా పనిచేయాల్సిందేనని సిబ్బంది ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లోని ప్రధాన పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో తరచూ పెచ్చులు ఊడి సిబ్బందిపై పడుతున్నాయి. ఏడాదిక్రితం పశువైద్య సిబ్బందిపై పెచ్చులు పడి గాయాలయ్యాయి. సిబ్బంది ఉన్న సమయంలో భవనం పైకప్పు పడిపోతే అందరం చనిపోవాల్సిందేనని, ప్రాణ భయంతో విధులు నిర్వహిస్తున్నామని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జూలెకల్‌లోని పశువైద్యశాల సబ్‌సెంటర్ సగం వరకు కూలిపోగా మిగతా సగ భాగంలో వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



పెచ్చులూడుతున్న పశువైద్యశాల



మద్దూరు బాలికల ఉన్నత పాఠశాలలో శిథిలావస్థలో గది



మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌లో కమ్మరిబుచ్చమ్మ ఇల్లు



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో..

వే బ్రిడ్జి తూకంలో తేడాలు

- ప్రతివెయ్యికి.. పది కిలోల వ్యత్యాసం
- తనిఖీల్లో బయట పడ్డ మోసం

జడ్చర్ల: భారీ తూకాలకు సంబంధించి గుడ్డిగా వేబ్రిడ్జిలపై ఆధారపడుతున్న వారికి నిర్వాహకులు తమ చేతివాటం చూపిస్తున్నారు. తాజాగా ఓ ఘటన సోమవారం జడ్చర్ల మండలం చర్లపల్లి శివారులో ఓ వే బ్రిడ్జి వద్ద వెలుగు చూసింది. జిల్లా తూనికల కొలతల ఇన్‌చార్జ్ అధికారి రామకృష్ణ కథనం మేరకు.. గ్రామ శివారులోని వేబ్రిడ్జి వద్ద తూకాల్లో తేడా వస్తున్నట్లు గుర్తించిన పలువురు వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించి హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన వేయి కిలోల బాట్లను వే బ్రిడ్జిపై తూకం వేసి అధికారులు తనిఖీ చేశారు. కాగా ప్రతివెయ్యికి 10 కిలోల చొప్పున, 5వేల కిలోల వద్ద 40 కిలోల మేర వ్యత్యాసం వచ్చినట్లు గుర్తించారు. ఈ వ్యత్యాసం 30 టన్నుల లారీ ఉన్నప్పుడు మరింతగా పెరుగుతుందన్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. నిర్వాహకులు తమ దగ్గర గల ప్రామాణికమయిన బాట్లతో సరి చూసుకున్న తరువాతే వే బ్రిడ్జిని వినియోగించాల్సి ఉంటుందన్నారు. కానీ అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా కొనసాగించడం వల్లే తేడాలు వస్తున్నాయన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా వెరిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుందని, ఒక టన్నుకు తక్కువ కాకుండా బాట్లను అందుబాటులో ఉంటుచుకోవాలన్న నిబంధన పాటించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారులకు అనుమానం వస్తే తమ దగ్గర ఉన్నబాట్లను తూకం వేసి సరి చూపాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు నిబంధనలను ఉల్లంఘించే వారిపై తమ కార్యాలయంలో లేదా వాట్సాప్ ద్వార 9010651783 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో పౌరసరఫరాల శాఖ అధికారి బాలప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లో వినతి అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. పీఆర్‌సీ, నిర్ణయించిన మినిమమ్ స్కేల్‌ను ఇవ్వాలన్నారు. గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా కార్మికులను సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లోని వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ఏడాదికి 3 జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. వాటికి నగదు రూపంలో అలవెన్సులు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, గ్రాట్యుటీ చట్టాలను అమలు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, ఆదివారాలు, పండుగ సెలవులు, జాతీయ సెలవు దినాలను అమలు చేయాలన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని, వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవదానం, జిల్లా కార్యదర్శి సాంబశివుడు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

తల్లీబిడ్డలు అదృశ్యం: కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడుకు చెందిన వివాహితతో పాటు ఆమె పిల్లలు అదృశ్యమయ్యాయిరు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచుపాడు చెందిన గోవిందమ్మను వనపర్తి జిల్లా, చిన్నంబావి మండలం, చిన్నదగడకు చెందిన మద్దిలేటికి ఇచ్చి వివాహం చేశారు. గత నెల 10న ఇంట్లో గొడవపడి గోవిందమ్మ కంచుపాడుకు వచ్చింది. పెద్దల సమక్షంలో మాట్లాడి నచ్చచెప్పారు. గత నెల 13న చిన్న దగడకు పంపినట్లు తెలిపారు. కానీ సోమవారం భర్త మద్దిలేటి వచ్చి తన భార్య గోవిందమ్మ, కుమార్తె పూజిత, కుమారుడు శివ శంకర్ కనబడటం లేదని చెప్పాడు. వివాహిత అన్న కుమ్మరి బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కేఎస్పీ పెండింగ్ పనులు పూర్తిచేస్తాం

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంధిర బోయి

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తిచేసి ఆయకట్టును పెంచడానికి కృషి చేస్తామని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. సోమవారం సాయంత్రం ప్రాజెక్టును సందర్శించి గేట్లు, చుట్టూ పరిసరాలు, ప్రాజెక్టు కట్ట, అలుగు పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.100 కోట్ల పనులు పెండింగ్‌లో ఉండటంతో వాటి గురించి అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు పరీవాహక ప్రాంతం, వరద ప్రవాహం, కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు వివరాలను అధికారులు వివరించారు. ప్రాజెక్టు కింద 14,650 ఎకరాలు సాగవుతుండగా.. ఎడమ కాల్వ పొడిగింపుతో 8,500 ఎకరాలు, దేవరకద్ర గ్రావిటీ కెనాల్‌తో మరో 5 వేల ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ ఈఈ కిరణ్‌కుమార్, పంపుహౌస్ డీఈ నయీం, ఏఈ జాకీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

డాక్టర్స్‌డే రోజు విషాదం

- పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తూ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎం మృతి

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవుట్‌సోర్సింగ్‌లో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి (42) సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. ఆస్పత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కృషవేణి ఎప్పటి మాదిరిగా సోమవారం విధులకు వచ్చింది. తన విభాగంలో విధులు నిర్వహిస్తూ అందరు చూస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స, సీపీఆర్ చేశారు. అక్కడే ఉన్న 108లో ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమెను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందిందని వివరించారు. కాగా మృతురాలికి భర్తతో పాటు కుమారుడు ఉన్నారు. చురుకుగా విధులు నిర్వహిస్తు ఉండే ఏఎన్‌ఎం తమ ముందే ప్రాణాలు కోల్పోవటంతో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డాక్టర్స్‌డే రోజే ఆమె మృతి తీరని లోటని తెలిపారు.



కృష్ణవేణి (ఫైల్)

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన అనిల్ రేషన్ లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన 30 క్వింటాళ్ల బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున బొలెరో వాహనంలో గద్వాల నుంచి రాయచూర్‌కు తరలిస్తున్నారు. పట్టణ శివారులో తనిఖీలు చేయగా రేషన్ బియ్యంను గుర్తించామన్నారు. వాహనం, బియ్యం స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు

- టీడీపీ నుంచి సి.రామచంద్రయ్య
- జనసేన నుంచి పిడుగు హరిప్రసాద్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్డీయే కూటమి అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. రెండు స్థానాల్లో టీడీపీ, జనసేన ఒక్కొక్కటి పంచుకోవాలని నిర్ణయించారు. టీడీపీ తరపున సి. రామచంద్రయ్య, జనసేన తరపున పిడుగు హరిప్రసాద్ కూటమి అభ్యర్థులుగా మంగళవారం నామినేషన్లు దాఖలు చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కూటమి సంఖ్యా బలం 164 కావడంతో వీరిద్దరి ఎన్నిక లాంఛనమే. ఎమ్మెల్సీలు అయిన సి. రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ పార్టీ ఫిరాయించడంతో వారిపై అనర్హత వేటు పడింది. దీంతో ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో సి. రామచంద్రయ్యకు టీడీపీ మళ్లీ అవకాశం కల్పించగా జనసేన హరిప్రసాద్‌ను ఎంపిక చేసింది.

పింఛన్లపై పెత్తనం

ఏపీలో మరోసారి జన్మభూమి కమిటీలదే రాజ్యం

ఐదేళ్లు వివక్ష లేకుండా అందించిన పెన్షన్లకు రాజకీయ రంగులు

- పేరుకు మాత్రమే సచివాలయాల ఉద్యోగుల ద్వారా పంపిణీ
- కూటమి పార్టీ నేతల కనుసన్నల్లోనే అంతా..
- ఆధిపత్యం కోసం టీడీపీ - జనసేన ఆరాటం
- కార్లలో, చెట్ల కింద, రచ్చబండ, ప్రైవేట్ స్థలాలకు రప్పించడంతో లబ్ధిదారుల పడిగాపులు


అనకాపల్లి జిల్లా నక్కపల్లి సచివాలయం వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఐదేళ్లు ఎలాంటి వివక్షకు తావులేకుండా టంచన్‌గా, పారదర్శకంగా అందించిన పింఛన్లపై జన్మభూమి కమిటీల రాజ్యం మళ్లీ మొదలైంది. టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా సోమవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లో సాగింది. ఇంటివద్ద అందించాల్సిన పెన్షన్లను కొన్నిచోట్ల చెట్ల కింద, రచ్చబండ వద్ద, ప్రైవేట్ స్థలాల్లో ఇస్తామని తిప్పడంతో పడిగాపులు కాసి అవస్థలు ఎదుర్కొన్నారు. పేరుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించినా పంపిణీ మొత్తం ప్రతి చోటా అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలోనే జరిగింది. పింఛన్ల పంపిణీలో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల స్థానిక టీడీపీ నాయకులు చేతివాటం చూపినట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. పల్నాడు జిల్లా మాచర్ల సహా పలు చోట్ల కమీషన్ల కింద రూ.500 మినహాయించుకుని ఫించన్ ఇస్తున్నట్లు కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. 2014-19 మధ్య కూడా టీడీపీకి చెందిన జన్మభూమి కమిటీ సభ్యులు లంచాల వసూళ్లకు తెగబడి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అదే వాతావరణం కనిపించినట్లు వాపోతున్నారు. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలంలో 94 మంది లబ్ధిదారులకు మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఫిర్యాదుతో ఈ నెల ఫించన్లు నిలిచిపోయాయి. ఇన్నాళ్లూ ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే ఇంటివద్దే నిశ్చింతగా కోవిడ్ కష్టకాలంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా అందిన ఫించన్లు ఈసారి కొన్నిచోట్ల ఉదయం 8 గంటలు దాటుతున్నా చేతికి అందకపోవడంతో పలుచోట్ల లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల మంజూరు మొదలు పంపిణీ దాకా రాజకీయాలకు అతీతంగా, ఎవరి సిఫారసులు అవసరం లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లను అందచేసిన విషయం తెలిసిందే. దీనికి పూర్తి భిన్నంగా తాజాగా పింఛన్ల పంపిణీ కొనసాగింది. గ్రామాల్లోనూ, వార్డులోనూ సచివాలయాల ఉద్యోగుల వెంట స్థానిక టీడీపీ, జనసేన నాయకులు మోహరించారు. ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందచేస్తూ పోటాపోటీగా నేతలు ఫోటోలు దిగారు. విజయనగరం తదితర చోట్ల తమ అధిపత్యం నిరూపించుకునేందుకు జనసేన - టీడీపీ నేతలు పరస్పరం దాడులకు దిగిన ఉదంతాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూటమి నేతలు కొన్ని చోట్ల తమ ప్రత్యర్థి పార్టీకి ఓటు వేశారనే అక్కసుతో పలువురు పింఛన్లను తొలగించినట్లు వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో పెదంచలలో వైఎస్సార్ సీపీకి ఓటు వేసినందుకు తమ పింఛన్లు నిలిపివేశారంటూ కొందరు లబ్ధిదారులు సచివాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. కాగా నంద్యాలలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న 29వ వార్డు సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ సుధారాణి (32) సోమవారం రాత్రి తన ఇంట్లో బాత్‌రూమ్‌లో అనుమానాస్పద రీతిలో మరణించారు. వారం క్రితం స్థానిక సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసాతో పాటు సచివాలయ ఉద్యోగులను బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన సుధారాణి సోమవారం టీడీపీ నేతలతో కలసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్న అనంతరం అనుమానాస్పద రీతిలో మరణించారు.

తొలిరోజు 95 శాతం..

మొత్తం 64.75 లక్షల మంది లబ్ధిదారులకుగానూ తొలి రోజు సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 61 లక్షల మంది (దాదాపు 95 శాతం)కి పైగా పింఛన్ల పంపిణీ పూర్తైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వలంటీర్లతో సంబంధం లేకుండా పూర్తిగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పంపిణీ కొనసాగించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల వలంటీర్లు వారి వెంట వెళ్లి పంపిణీలో పాల్గొన్నారు. ఉదయం కొద్దిసేపు సాంకేతికపరమైన అవాంతరాలు తలెత్తడంతో వాటిని సరిదిద్ది ప్రక్రియ కొనసాగించారు.

వృద్ధులు ఉసూరు..

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో కొన్ని వార్డుల్లో లబ్ధిదారులను నిర్దేశిత ప్రాంతానికి రావాలని ఆదేశించడంతో వృద్ధులు, దివ్యాంగులు నానా పాట్లు పడి అక్కడకు చేరుకున్నారు. కొందరి వేలిముద్రలు పడకపోవడంతో ఐరిస్‌తో ప్రయత్నించారు. చివరకు సరిపోలడం లేదని, ఫించన్ ఇవ్వలేమని చెప్పడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. పలువురు వృద్ధులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. మరికొన్ని వార్డుల్లో సచివాలయాలకు తాళం వేసి సిబ్బంది పింఛన్ల పంపిణీకి వెళ్లి పోవడంతో సమాచారం తెలియక పలువురు అక్కడకు చేరుకుని ఇబ్బందులు పడ్డారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మళ్లీ పాత బాబును చూస్తారు

చెప్పినట్లు నడుచుకోకపోతే 1995 నాటి సీఎం కనిపిస్తాడు జాగ్రత్త

- రాత్రికి రాత్రే ప్రజల ఆశలు తీరిపోవు
- అధికారులు కూడా కొత్త పాలనకు అలవాటు పడాలి
- పెనమాక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు

వలంటీర్లతో పనిలేకుండా పింఛన్ల పంపిణీ

- వ్యవస్థలతో పని చేయిస్తే ఎలా ఉంటుందో చూపించాం
- వలంటీర్లు రూ.100 తీసుకునేవారు
- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పవన్ కల్యాణ్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అమరులైన జవాన్ల కుటుంబాలను ఆదుకోవాలి

- ప్రభుత్వానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విజ్ఞప్తి
- లద్దాఖ్ ప్రమాదంలో జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: లద్దాఖ్‌లో యుద్ధ ట్యాంకు కొట్టుకుపోయిన ప్రమాదంలో భారత జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు జవాన్లు మరణించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. దేశ రక్షణలో ఈ జవాన్ల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. కృష్ణా జిల్లా పెడన మండలం చేవేంద్రకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాల్వపల్లెకు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి (జేసీవో) ముత్తుముల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా రేపల్లె మండలం ఇస్లాంపూర్‌కు చెందిన హవల్దార్ సుభాన్ ఖాన్ కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ జవాన్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు అమర జవాన్ల అంత్యక్రియల్లో పాల్గొనాలని, వారి కుటుంబాలకు బాసటగా నిలవాలని వైఎస్ జగన్ ఆదేశించారు.

కలిసి మాట్లాడుకుందాం

- రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై చర్చిద్దాం
- తెలంగాణ సీఎంకు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ
- ఈనెల 6న హైదరాబాద్‌లో ముఖాముఖికి ప్రతిపాదన

సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై కలిసి చర్చించుకుందామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా రెండు రాష్ట్రాల అభివృద్ధికి, సంక్షేమానికి పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరముందని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, రెండు రాష్ట్రాల లక్ష్యాలను సాధించడానికి సమన్వయంతో పనిచేయాల్సి వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయ్యాయని చంద్రబాబు ఈ సందర్భంగా ఆ లేఖలో గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. పునర్వ్యవస్థీకరణ చట్టంవల్ల ఎదురవుతున్న సమస్యలపై ఇప్పటికే అనేక చర్చలు జరిగాయని, ఇవన్నీ సంక్షేమం, పురోగతిపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి సామరస్యంగా ముందుకెళ్లడం అత్యవసరమని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం హైదరాబాద్‌లో కలుద్దామని రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిపాదించారు. ముఖాముఖి సమావేశం నిర్వహించుకుని క్లిష్టమైన సమస్యలపై సమగ్రంగా చర్చలు జరుపుదామన్నారు. ఏపీ, తెలంగాణకు పరస్పర ప్రయోజనం కలిగే పరిష్కారాలను కనుగొని అందుకనుగుణంగా సమన్వయంతో పనిచేయడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలి

- విభజన హామీలు అమలు చేయాలి
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక స్వావలంబన, సమ్మిళిత అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు ప్రధాని, కేంద్ర మంత్రుల్ని కలిసి ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరారని గుర్తుచేశారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడం ఏపీ ప్రజల్ని మోసం చేయడం, వారికి అన్యాయం చేయడమేనని అన్నారు. టీడీపీ మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నందున హోదా కోసం టీడీపీ ఒత్తిడి తేవాలన్నారు. విశాఖలో రైల్వే జోన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కూటమి పార్టీల నేతలు చేస్తున్న దాడుల్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. దాడుల్ని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలైమనందున కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన ఎస్పీ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సోమవారం అంబర్‌పేట పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్పీ పరవస్తు మధుకర్ స్వామి సందర్శించారు. ఆయనకు గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు స్వాగతం పలికారు. గార్డెన్‌లోని వివిధ విభాగాలను ఆయనకు చూయించి వివరించారు. మొక్కలను ఎలా సంరక్షిస్తున్నారో తెలియజేశారు. బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిల్వచేసిన అతిపెద్ద జెర్రిపోతు పాము కుబుసం చూసి ఎస్పీ వారిని గార్డెన్ సమన్వయకర్తను అభినందించారు. డిగ్రీ కళాశాల స్థాయిలో ఇలాంటి బొటానికల్ గార్డెన్, ఎడ్యుకేషన్ సెంటర్ ఉండటం జడ్చర్లకు తలమానికంగా మారిందని కొనియాడారు. తెలంగాణ స్టేట్ హెర్బేరియం తిలకించి ప్రశంసించారు. పోలీసు శిక్షణ కళాశాలలో ఇలాంటి గార్డెన్ పెంచటానికి సహకరించాలని కోరారు. లయన్స్‌క్లబ్ హైదరాబాద్ రీజినల్ చైర్మన్ రఘునాథరెడ్డి, శ్రీనివాసులు, వలంటీర్లు రాహుల్, నవనీత్, ఇందు, అనసూయ ఉన్నారు.

జూరాలకు స్వల్పంగా వరద



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వరద వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం 1,226 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని.. కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-2కు 844, సమాంతర కాల్వకు 800 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా 111 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.817 టీఎంసీలు ఉందన్నారు.

రామన్‌పాడులో 1,019 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,019 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల సమాంతర కాల్వ నుంచి 800 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదన్నారు. లిఫ్టులకు 871 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని చెప్పారు.

పచ్చని పొలాల్లో ఫార్మా చిచ్చు


నంచర్లగేట్ దేశాయిపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఫార్మా కంపెనీ

- ఆందోళనలో రైతులు
- బోర్లు, బావుల్లో విషంతో నిండిన నీరు
- విషపునీటితో ఎండిపోయిన జొన్నపంట

మహమ్మదాబాద్: పట్టణ ప్రాంతాల్లోనే కాలుష్యం కర్మాగారాలు, ఫ్యాక్టరీలు ఉన్నాయనుకుంటే అది కాస్త పల్లెలకు పాకింది. మండలంలోని నంచర్లగేట్ వద్ద దేశాయిపల్లి శివారులో కొన్నేళ్ల క్రితం మినీ ఇండస్ట్రీని ఏర్పాటు చేశారు. ఓ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేకున్నా కలర్ తయారీ కంపెనీ పేరు చాటున ఫార్మా కంపెనీ నడుపుతున్నారు. దీంతో మొదట్లో ఇక్కడి ప్రాంత రైతులు ఫార్మా కంపెని వద్దంటూ ఈప్రాంతమంతా విషపూరితం అవుతుందని ఆందోళన చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేకు కూడా మొరపెట్టుకున్నారు. అయినా కొందరి నాయకుల అండదండలతో కంపెనీ కొనసాగిస్తున్నారు. సోమవారం కొందరు గ్రామస్తులు, రైతులు వెళ్లి పరిశీలించగా విషయం బయటపడింది. వెంటనే ఫ్యాక్టరీ యాజమాన్యం వర్కర్లకు పంటలను చూయించారు.

బావులు, బోర్లలో విషపు నీరు..

రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కాలుష్య నీరు చుక్కకూడా బయటికి వదలమంటూ మొదట్లో ఒప్పందం చేసుకున్నారు. తీరా ఇప్పుడు చూస్తే బావుల్లోకి ఊట వస్తున్న విధంగా ఆయిల్ మాదిరి విషం నీళ్లలో వస్తున్నది. అలాంటి నీటిని రైతు తెలియకుండా జొన్నపంటకు వేయడంతో పంటంతా ఎండిపోయింది. దీంతో రైతు బోరుమంటూ గ్రామపెద్దలకు విషయం చెప్పడంతో వెళ్లి చూడగా కలుషిత నీరు బావిలోకి వస్తుంది.


కలుషిత నీటిని చూయిస్తున్న బాధిత రైతు అంజిలయ్య


ఫార్మా కంపెనీ నుంచి బావిలోకి వస్తున్న కలుషితనీటిని పరిశీలిస్తున్న రైతులు, గ్రామస్తులు

పశువులు, రైతులకు గుర్తుతెలియని వ్యాధులు

ఫార్మా కంపెనీ నుంచి వస్తున్న కలుషిత నీరు పశువులు తాగడంతో అంతుతెలియని వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు తెలిపారు. బావుల్లో ఉన్ననీటిని మొక్కలకు వివిధ రకాల పనులకు వాడినా, ముట్టుకున్నా వివిధ రకాలైన వ్యాధులు సంక్రమిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇలాంటి కలుషిత నీరు బావుల్లో, బోర్లలో వస్తే మాత్రం దాదాపు 64 ఎకరాలకు పంట ముప్పు వాటిల్లుతుందని రైతులు తెలుపుతున్నారు. ఇక్కడ పండిస్తున్న పంటలు సైతం విషపూరితంగా మారి అవితింటే ఎన్నో రోగాల పాలయ్యే అవకాశం ఉన్నదని రైతులు చెబుతుఆన్నరు.

మొదట్లోనే కంపెనీ వద్దన్నాం..



మా గ్రామంలో రెవెన్యూ పొలాలకు ఆనుకుని ఏర్పాటు చేస్తున్న కంపెనీల్లో ప్రమాదకరమైన ఫార్మా కంపెనీని మొదట్లోనే వద్దన్నాం. నిర్మాణాలు చేపట్టేటప్పుడు మాత్రం కలర్ కంపెని అని చెప్పారు. తర్వాత ఫార్మా కంపెని ఏర్పాటు చేశారు. దీంతో మా పొలాలకు పశువులకు ఎంతో నష్టం వాటిల్లుతుంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– కృష్ణయ్య, రైతు, దేశాయిపల్లి

పొలాల్లో విషపు నీరు..



మందుల కంపెనీ ఏర్పాటుతో ఈ ప్రాంతపు పొలాల్లో విషం కలుస్తుంది. ప్రస్తుతం మా బావిలో వరద నీరులా ఫ్యాక్టరీ నుంచి విషపునీరు వస్తుంది. ఇలాంటి నీటిని తెలియకుండా పంటకు వేశాం జొన్నపంట నాశనమైంది. నీటిని ముట్టుకుంటే మాకు కూడా చర్మవ్యాధులు వస్తున్నాయి. మా పొలాలకు రక్షణ కల్పించాలి.

– దొంగల భగవంతు, రైతు, దేశాయిపల్లి

చుక్కనీరు కూడా భూమిలోకి పోదు..

ఫార్మా కంపెనీ నుంచి వచ్చే నీరు భూమిలోకి పోనివ్వం. అలాంటి నీటిని ఓ ట్యాంకులోకి వదిలి మళ్లీ ఆ నీటిని ఫిల్టర్ చేసి అవసరాలకు వినియోగిస్తాం. మా ఫ్యాక్టరీ నుంచి ఎలాంటి వ్యర్థనీరు బయటికి వచ్చినా.. దాన్ని ల్యాబ్‌కు పంపించి పరీక్ష చేయించిన తరువాత నిర్ణయం తీసుకుంటాం.

– ప్రవీణ్‌గౌడ్, ఫ్యాక్టరీ యాజమాన్యం

వేంకటేశ్వరస్వామికి గజవాహన సేవ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కంచికామకోటి పీఠం పాలమూరుశాఖ ఆధ్వర్యంలో సోమవారం స్వామివారికి ప్రాతఃకాల సమయంలో సుప్రభాతసేవ, వేదపారాయణం, మూలమంత్ర అనుష్టానములు, శ్రీసూక్త పురుష సూక్త హోమాలు నిర్వహించా రు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గజవాహనంపై దర్శనమిచ్చారు. భక్తుల కోలాట ప్రదర్శనల నడుమ స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర సేవామండలి అధ్యక్షుడు తోటపల్లి శ్రీకాంత్ శర్మ, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్ర శర్మ పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామికి గజవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

కురుమూర్తిస్వామి ఆలయంలో వరుణయాగం


కురుమూర్తి స్వామి ఆలయంలో వరుణ యాగం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలో వెలిసిన కురుమూర్తి స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు వరుణ యాగం కార్యక్రమం చేపట్టారు. ముందుగా స్వామి వారికి అర్చన అభిషేకం నిర్వహించారు. అనంతరం యాగ మండపాలను అలంకరించి వేద మంత్రోచ్చరణలతో వరుణ యాగం చేశారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వెంకటాచారి మాట్లాడారు. వర్షాలు సకాలంలో కురువక రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి ఇబ్బందుల దృష్ట్యా ఆలయంలో వరుణయాగ కార్యక్రమం చేపట్టామన్నారు. వరుణ యాగం ఫలితంగా రాష్ట్రంలో వర్షాలు బాగా కురిసి పంటలు పండి రైతులు ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది మరియూ వివిధ ప్రాంతాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.


సెల్‌ఫోన్ వెలుతురులో ప్రసూతి విభాగం

అంధకారంలో జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి

- చీకట్లో రోగుల ఇబ్బందులు

జడ్చర్ల: విద్యుత్ సరఫరా అకస్మాతుగా నిలిచిపోవడంతో వైద్య చికిత్సల నిమిత్తం వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటన జడ్చర్ల వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఆస్పత్రిలో వర్షం కారణంగా కొంత సమయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని రోగులు ఈ సందర్భంగా తెలియజేశారు. దీంతో అత్యవసర విభాగంతో పాటు సాధారణ వార్డుల్లో సైతం చీకట్లు కమ్ముకున్నాయి. అదేవిధంగా ప్రసూతి విభాగంలో బాలింతలు, చిన్నారులు విద్యుత్ వెలుగు, ఫ్యాన్లు లేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దోమలు ఎక్కువగా ఉండటంతో టవల్స్, తదితర వాటితో గాలి వచ్చేలా ఊపుతూ చిన్నారులను పడుకోబెట్టారు. ఆస్పత్రి ప్రాంగణంలో భారీ జనరేటర్ ఉన్నా.. డీజిల్ లేకపోవడంతో జనరేటర్ పనిచేయలేదు. దీంతో చీకట్లో మొబైల్ ఫోన్ల వెలుతురులో వైద్య సిబ్బంది రోగులకు చికిత్సలు అందించారు. దాదాపు మూడు గంటల తరువాత జనరేటర్‌లో డీజిల్ పోసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో దాదాపు 20 నిమిషాలు మాత్రమే విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటుచేసుకుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సోమశేఖర్ ఈ సందర్భంగా తెలియజేశారు. జనరేటర్‌లో డీజిల్ అయిపోవడంతో వెంటనే వెళ్లి డీజిల్ తీసుకొచ్చి ఆన్ చేశామన్నారు. ఇన్‌వర్టర్ బ్యాటరీలు బ్యాకప్ ద్వారా గంటన్నర పాటు విద్యుత్ సరఫరాను కొనసాగిస్తాయని అన్నారు. ఆస్పత్రికి సంబంధించి విద్యుత్ కనెక్షన్‌ను జడ్చర్ల పట్టణానికి లింక్ చేయాలని విద్యుత్ అధికారులకు కోరినా ఫలితం లేకపోయిందన్నారు. గంగాపూర్ ఫీడర్‌కు ఆస్పత్రి కనెక్షన్ ఇవ్వడంతో సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలియజేశారు.


సెల్‌ఫోన్ లైట్ వెలుగులో చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది